




ఆనందాల రంగవల్లులు

నూతన సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులు బుధవారం చక్కటి రంగవల్లులు తీర్చిదిద్దారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలో రకరకాల ముగ్గులు వేశారు. తాము వేసిన రంగవల్లుల వద్ద కూర్చుని ఫొటోలకు ఫోజులిచ్చారు. అందమైన, సందేశాత్మక ముగ్గులు వేసిన వారిని విజేతలుగా ప్రకటించారు. ప్రిన్సిపాల్ చేతుల మీదుగా బహుమతులు అందించి అభినందించారు.
- పెందుర్తి

దొరకని గ్రాసం.. పశుపోషణ భారం

- యంత్రాల వినియోగంతో ఎండు గడ్డి కొరత
- విపరీతంగా పెరిగిన దాణా ఖర్చులు
- పశువులను వేధిస్తున్న వ్యాధులు
- ఆందోళనలో పాడి రైతులు

పాడి రైతులకు పశుపోషణ భారమవుతోంది. వ్యవసాయంలో యాంత్రీకరణ ఓ రకంగా రైతుల శ్రమను తగ్గిస్తున్నా.. పాడి సంపదపై దాని ప్రభావం విపరీతంగా పడుతోంది. నూర్పిడి యంత్రాల వినియోగంతో ఎండు గడ్డి కొరత తీవ్రంగా ఉంది. దీంతో పాటు పెరిగిన దాణా ఖర్చులతో పాడిరైతులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. పోషకాలు కలిగిన దాణా లేకపోతే పశువుల్లో వ్యాధుల బెడద పెరిగి, పాల దిగుబడి తగ్గుతుందని ఆందోళన చెందుతున్నారు.



మండలంలో గ్రామ పంచాయతీలు	24
మండలంలో మొత్తం పాడి రైతులు	8,000
ఆవులు	10,640
గేదెలు	7,927
మొత్తం పాడి పశువులు	18,567

సబ్బవరం:

మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో వ్యవసాయంలో ఏటా యంత్రాల వినియోగం పెరుగుతోంది. దీంతో పశుగ్రాసానికి ఎక్కువగా వినియోగించే ఎండు గడ్డి కొరతగా మారింది. మరోవైపు మండలంలో వరిసాగు తక్కువగా ఉండటం కూడా ఎండు గడ్డి కొరతకు కారణం. ఎక్కడో ఒక చోట దొరికే కాస్త ఎండు గడ్డికి కూడా భారీ డిమాండ్ ఏర్పడటంతో వేలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేయాల్సి వస్తోందని పాడి రైతులు వాపోతున్నారు. ఇతర జిల్లాల నుంచి సబ్బవరం తరలివచ్చే ఎండు గడ్డి ట్రాక్టర్ రూ.10 వేలు నుంచి రూ.12 వేలు వరకూ ధర పలుకుతోంది. పశుపోషణలో ప్రభుత్వ ప్రోత్సాహం కూడా కరవైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మార్కెట్లో ప్రస్తుతం.. దాణా రేట్లు

దాణా రకం	పరిమాణం	ధర(రూ.లలో)
తవుడు	50 కిలోలు	1,400
నూకలు(పెద్దవి)	50 కిలోలు	1,200
నూకలు(చిన్నవి)	50 కిలోలు	1,100
బరాణీ బొత్తు	50 కిలోలు	1,200
బరాణీ పిండి	50 కిలోలు	1,500
మినప పొట్టు	50 కిలోలు	1,250
పెసర పొట్టు	50 కిలోలు	1,200
వరి గడ్డి	ట్రాక్టర్ లోడ్	10,000


పశువులను మేత నుంచి ఇంటికి తీసుకువస్తున్న పాడి రైతు


వంగలి సమీపంలో పశుగ్రాసం మేస్తున్న పశువులు

దాణా ధరలు ఇష్టారాజ్యం

పాడి పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్న పాడి రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతులంతా పశువుల కోసం ఎండు గడ్డితో పాటు తవుడు, నూకలు, బరాణీ బొత్తు, పెసర, మినప పొట్టు తదితర వాటిని వినియోగిస్తున్నారు. వీటిని ఆసరాగా చేసుకుని వ్యాపారులు ఇష్టారాజ్యంగా వాటి ధరలను పెంచుకుంటూ పోతున్నారు.

దీంతో పాడి రైతులు మరో దారిలేక తప్పనిసరి పరిస్థితుల్లో వ్యాపారులు చెప్పిన ధరలకే దాణా కొనుగోలు చేయాల్సి వస్తోంది. దాణా ధరల స్థాయిలో పాల సేకరణ ధరలు మాత్రం పెరగట్లేదు. శీతాకాలంలో పాడి పశువులకు పశు గ్రాసంతో పాటు అధిక పోషక విలువలు కలిగిన దాణా అందిస్తేనే పాల దిగుబడి ఉంటుందని రైతులు చెబుతున్నారు.

పశు సంవర్ధక శాఖ అధికారులు స్పందించి, ప్రభుత్వం ద్వారా రాయితీపై దాణా సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

మరో దారిలేకే పశుపోషణ



మాకు 4 గేదెలు, 2 పెయ్యలు ఉన్నాయి. వీటిలో పాలు ఇస్తున్న పాడి గేదెలు కూడా ఉన్నాయి. పశుపోషణ ఇబ్బందిగా మారింది. ఒక పక్క మేత దొరక్క, మరో పక్క పశువుల్లో వచ్చే వ్యాధుల భయంతో ఆందోళన చెందుతున్నాం. దాణా రేట్లు విపరీతంగా పెరిగిపోయాయి. పాల రేట్లు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఇది తప్ప మరో దారి లేక పశు పోషణలోనే నెట్టుకొస్తున్నాం.
– నంబారు సన్యాసిరావు, రాయపుర అగ్రహారం

కొరవడిన ప్రభుత్వ సాయం



మాకు 4 గేదెలు, 2 పెయ్యలు ఉండేవి. ప్రస్తుతం దాణా ఖర్చులు విపరీతంగా పెరిగిపోవడంతోపాటు పశుగ్రాసం సరిగా లేకపోవడంతో 3 గేదెలను అమ్మేశాం. ప్రస్తుతం ప్రభుత్వం నుంచి పాడి పరిశ్రమకు అంతగా ప్రోత్సాహం కనిపించడం లేదు. గతంలో పశు వైద్యశాలలు, సచివాలయాల్లో రాయితీపై గడ్డి విత్తనాలను అందించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు.
– వడిశల నూకాలమ్మ, తెలుకులపాలెం

గడ్డి విత్తనాల కొరత



పశు గ్రాసానికి వినియోగించే రాయితీ గడ్డి విత్తనాల కొరత ఉంది. ఈ ప్రభుత్వం వచ్చాక 3 వేల కిలోల కాకిజొన్న, 100 కిలోల బొబ్బర్ల విత్తనాలకు ఇండెంట్ పెట్టాం. గతంలో మాదిరి రైతులకు రాయితీపై అందించే పాతర గడ్డి అందుబాటులో లేదు. మండలంలో పాతర గడ్డి తయారీ యూనిట్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నాం. అందుబాటులోకి వస్తే పాడి రైతులకు కొంత మేలు కలుగుతుంది.
– ఉషా కుమారి, సహాయ సంచాలకులు, ప్రాంతీయ పశు వైద్యశాల, సబ్బవరం

క్లుప్తంగా

గ్రామాల్లో మేలుకొలుపు ఊరేగింపులు


నాయుడుపాలెంలో పల్లకీ ఊరేగింపులో భక్తులు

పరవాడ: నాయుడుపాలెంలో గ్రామ ధార్మిక జట్టు సభ్యుల సహకారంతో 17వ రోజు మేలుకొలుపు కార్యక్రమాన్ని బుధవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వినాయక దేవాలయం కేంద్రంగా భగవంతునికి ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లకీని గ్రామంలోని వీధివీధినా ఊరేగించారు. తమ ఇంటి వద్దకు పల్లకీపై వచ్చిన దేవతా విగ్రహాలకు గ్రామ భక్తులు ప్రత్యేక పూజలు జరిపి, ఆరాధించారు. నాయుడుపాలెం గ్రామంతో పాటు వాడచీపురుపల్లి గ్రామంలోనూ పల్లకీని ఊరేగించారు.

వైభవంగా పగల్‌పత్తు ఉత్సవాలు


పగల్‌పత్తు ఉత్సవాల్లో నిర్వహిస్తున్న తిరువీధి

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో పగల్‌పత్తు ఉత్సవాలు రెండవరోజు బుధవారం వైభవంగా జరిగాయి. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని శోభాయమానంగా అలంకరించి బంగారుఛాయ పల్లకీలో కొలువుంచారు. తెల్లవారుజాము 5గంటల నుంచి ఆలయ బేడామండపంలో విశేషంగా తిరువీధి నిర్వహించారు. శోడషోపచార పూజలు జరిపారు. ధనుర్మాసం సందర్భంగా గోదాదేవికి ఆలయ బేడామండపంలో విశేషంగా తిరువీధి నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో 17వ పాశుర విన్నపం చేశారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అర్చకులు ఈ కార్యక్రమాలను నిర్వహించారు.

అప్పన్న అన్నదానానికి రూ.లక్ష విరాళం


అన్నప్రసాద బాండ్ అందుకుంటున్న దాత జేఎస్ఎన్ రాజు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరంలోని పీఎం పాలేనికి చెందిన జేఎస్ఎన్ రాజు రూ.లక్ష 116ల విరాళాన్ని అందించారు. సంబంధిత విరాళాన్ని నగదు రూపంలో సింహగిరి పైనున్న పీఆర్వో కార్యాలయంలో అధికారులకు ఇచ్చారు. దేవస్థానం తరఫున దాతకు ప్రొటోకాల్ సూపరింటెండెంట్ విక్రమ్ దాతకు బాండ్‌ని అందించారు. స్వామివారి దర్శనం కల్పించి, ప్రసాదం, శేషవస్త్రాన్ని అధికారులు అందజేశారు.

అప్పన్న సన్నిధిలో ఎమ్మెల్యే గణబాబు


బేడా మండపంలో ఎమ్మెల్యే గణబాబు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గణబాబు బుధవారం దర్శించుకున్నారు. ఉదయం జరిగిన స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అనంతరం ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని, శేషవస్త్రాన్ని అధికారులు అందించారు.

నూతన సంవత్సర వేళ.. శుభాకాంక్షల వెల్లువ



కేక్ కట్ చేసి నాయకులకు తినిపిస్తున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్


ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబుకు శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు


వరుదు కల్యాణికి శుభాకాంక్షలు తెలుపుతున్న గండి రవికుమార్ తదితరులు

పెందుర్తి: మండలంలోని రాంపురంలో వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌కు ఉదయం నుంచి పెందుర్తి, సబ్బవరం, పరవాడ మండలాలతోపాటు, నియోజకవర్గ పరిధి పట్టణ ప్రాంతాల నుంచి పార్టీ నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి పుస్తకాలు, విద్యార్థులకు ఉపయోగపడే ఇతర సామగ్రి అందించి శుభాకాంక్షలు తెలిపారు.

పార్టీ నాయకుల సమక్షంలో అదీప్‌రాజ్ కేక్ కట్ చేశారు. పార్టీ సీనియర్ నాయకులు బయిలపూడి భగవాన్ జయరామ్, ఉప్పిలి కనకరాజు, బోకం రామునాయుడు, కొటాన రాము, సబ్బవరపు ముత్యాలనాయుడు, చొప్పా నాగరాజు, సబ్బవరపు నారాయణమూర్తి, పాలిశెట్టి సురేష్‌రాజ్, కాపుశెట్టి శేషుబాబు, గొరపల్లి శ్రీను, రాపర్తి మాధవరావు, దాడి ఉమామహేష్, మెంటి మహేష్, కర్రి బాబు, గండ్రెడ్డి మహాలక్ష్మినాయుడు, అప్పికొండ మహాలక్ష్మినాయుడు, దాడి నూకరాజు, కొలుసు ఈశ్వరరావు, ఉగ్గిన గోవింద, బొడ్డు సూర్యప్రకాష్, కొయిలాడ శ్రీను, గొంప అప్పారావు, కోన శ్రీనివాసరావు, బి.ఎస్ రాజు, వద్దాది అప్పలరాజు, మోపాడ అప్పారావు, బోని గంగునాయుడు, బల్ల రాంబాబు, తామర్ల నర్సింగ్, కొటాన రామకృష్ణ, సూరిశెట్టి సూరిబాబు, మెంటి సూరిబాబు, బయిలపూడి దేముడుబాబు, రాపేటి రాము, దెడ్డం ప్రసాద్, దాసరి సత్తిబాబు, బలిరెడ్డి కనకరాజు, ఎస్.అప్పారావు, గొన్న హేమచంద్ర, బట్టు పైడిరెడ్డి, ఎంపీ రెడ్డి, కర్రి వినోద్‌కుమార్, పీతల అప్పలరాజు, నాగభూషణంనాయుడు, కోన రామారావు, కొవిరి శివ, భారీ ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు.

జనసేన కార్యాలయంలో..

సుజాతనగర్‌లోని జనసేన కార్యాలయంలో జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అధికారులు, కూటమి నాయకుల సమక్షంలో కేక్ కట్ చేశారు. నియోజకవర్గంలోని పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్, జీవీఎంసీ, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది, కూటమి నాయకులు ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సబ్బవరం: మండలంలో పలు ప్రభుత్వ కార్యాలయాలు, పార్టీ కార్యాలయాల్లో నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా అధికారులు, నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని స్థానిక తహసీల్దార్ బి.చిన్నికృష్ణకు, ఎంపీడీవో పద్మజకు పలువురు అధికారులు, కింది స్థాయి సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్, స్థానిక పార్టీ నాయకులతో కలిసి పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణిలను కలిసి పుష్పగుచ్ఛాలిచ్చి, శుభాకాంక్షలు అందించారు. ఆయన వెంట పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు, ఐడీ బాబు, సర్పంచ్ నేబర్తి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ సిరపరపు వాసు, సిరపరపు నవీన్ తదితరులు ఉన్నారు.

'నవనీత'ధారుడు



నవనీత అలంకరణలో వెంకన్న, స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

- వేంకటాద్రి వెంకన్నకు నవనీత సేవ
- 5న సుదర్శన హోమం

పెందుర్తి: స్థానిక వేంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం తిరుప్పావై సేవాకాలం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తిరుప్పావై 17వ పాశురాన్ని వివరించారు. అనంతరం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని స్వామివారికి నవనీత సేవ ఘనంగా నిర్వహించారు. వేకువజామున తిరుప్పావై పారాయణం అనంతరం 27 కిలోల వెన్నతో స్వామికి అలంకరణ చేశారు. ఆలయ ప్రధాన పురోహితుడు రామానుజాచార్యుల ఆధ్వర్యంలో విశేష అర్చనలు జరిపారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత శరగడం చినఅప్పలనాయుడు సహా పలువురు భక్తులు స్వామివారి సన్నిధిలో తులాభారం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు దంపతులు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, వ్యాపార వేత్త దాడి రమణచిట్టి, ఆలయ కమిటీ చైర్మన్ ఎం.ఎస్.రాజు, పలువురు ప్రముఖులు, వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈవో నీలిమ పర్యవేక్షణలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా ప్రసాద వితరణ చేపట్టారు. కొండ దిగువ నుంచి భక్తులకు ఉచిత రవాణా సదుపాయం కల్పించారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 5న వేంకటాద్రిపై సుదర్శన హోమం నిర్వహించనున్నారు.


స్వామివారి సన్నిధిలో ఎమ్మెల్యే పంచకర్ల దంపతులు

పంచగ్రామాల భూసమస్యకు శాశ్వత పరిష్కారం

- సింహాచలం దేవస్థానం అభివృద్ధికి చర్యలు
- అప్పన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే గంటా

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంతో ముడిపడి ఉన్న పంచగ్రామాల భూసమస్య ఎన్నికల నినాదంగా మారుతోందని, ఇక మీదట ఏ ఎన్నికల్లో ఎవరూ ప్రస్తావించని రీతిలో శాశ్వత పరిష్కారం చూపుతామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. సింహాచలేశుని బుధవారం దర్శించుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. దేవస్థానం భూసమస్య అతి త్వరలోనే పరిష్కారం అవుతుందన్నారు. సింహాచలం దేవస్థానాన్ని అభివృద్ధి చేస్తామని, స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు ఒకరోజు సింహగిరిపై ఉండేందుకు కావాల్సిన సకల సౌకర్యాలను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రస్తుతం కేంద్రప్రభుత్వ ప్రసాద్ స్కీమ్ పనులు జరుగుతున్నాయని, ఆ పనులను, దివ్యక్షేత్రం పనులను సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి చేస్తామన్నారు. అడవివరం బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణ బాధితులకు టీడీఆర్‌లు త్వరితగతిన అందించేందుకు కృషి చేస్తానన్నారు. తణుకు టీడీఆర్ స్కామ్‌తో అడవివరం బీఆర్‌టీఎస్ టీడీఆర్‌ల విషయాన్ని పోల్చడం సరికాదన్నారు. అంతకు ముందు ఆయన ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. ఆయన పేరిట అంతరాలయంలో అర్చకులు పూజలు నిర్వహించారు. స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాన్ని ఈవో త్రినాథరావు అందించారు. గంటా వెంట భీమిలి మాజీ ఎమ్మెల్యే కర్రి సీతారాం, 98వ వార్డు కార్పొరేటర్ పి.వి.నరసింహం, వార్డు టీడీపీ అధ్యక్షుడు పి.శ్రీనివాసరావు ఉన్నారు.


అప్పన్న ఆలయంలో ప్రదక్షిణ చేస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

నృసింహ దీక్షధారుల నగర సంకీర్తన

సింహాచలం: సింహాద్రి మఠం ఆధ్వర్యంలో బుధవారం ఉదయం శ్రీ నృసింహ దీక్షధారులు అడవివరం గ్రామంలో నగర సంకీర్తన ఘనంగా నిర్వహించారు. కొండదిగువ శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామి తొలిపావంచా నుంచి స్వామివారి చిత్రపటాన్ని చేతపట్టి, హరినామ సంకీర్తనలు ఆలపిస్తూ నగర సంకీర్తన జరిపారు. గ్రామస్తులు స్వామిని దర్శించుకుని హారతులు ఇచ్చారు. మఠం గురుస్వామి కశిరెడ్డి సురేంద్ర ఆధ్వర్యంలో దీక్షధారులు అప్పారావు, గోపి తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా ఎన్టీపీసీ-కలపాక రోడ్డు

పరవాడ: ఎన్టీపీసీ-కలపాక రహదారి అధ్వానంగా మారడంతో పలు గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారిలో నిత్యం పదుల సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్న హిందూజా బొగ్గు లారీల కారణంగా రోడ్డు అనేక చోట్ల ధ్వంసం కావడమే కాకుండా భారీ గుంతలు ఏర్పడ్డాయి.

ఎన్టీపీసీ, హిందూజా, ఫార్మాసిటీ పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు నిత్యం ఈ రహదారిలో రాకపోకలు సాగిస్తున్నారు. అధిక బరువు కలిగిన బొగ్గు లారీలు తిరుగుతుండడంతో రోడ్డు మరమ్మతులకు గురైంది. చీకటి పడితే విధులు ముగించుకుని ఇళ్లకు చేరే కార్మికులు, ఉద్యోగులు ఛిద్రమైన రోడ్డులో ప్రమాదాలకు గురై గాయాలపాలవుతున్నారు. ఈ రహదారిలో కనీసం వీధి దీపాలు కూడ లేవు. దీంతో కారు చీకట్లో రాకపోకలు సాగించడం వల్లే ప్రమాదాల బారిన పడుతున్నామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.


సోమునాయుడుపాలెం వద్ద రోడ్డు మలుపులో ఏర్పడిన పెద్ద గొయ్యి


ధ్వంసమైన ఎన్టీపీసీ-కలపాక రోడ్డు

వీవోఏల నూతన కార్యవర్గం


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

పరవాడ: వీవోఏల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సంఘ గౌరవ అధ్యక్షుడు వి.వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. స్థానిక మరిడిమాంబ కల్యాణ మండపంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షురాలిగా ఎస్.పైడిలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా ఎస్.వెంకటలక్ష్మి, కోశాధికారిగా జి.వరలక్ష్మి, ఉపాధ్యక్షులుగా వి.ఇందుమతి, సహాయ కార్యదర్శిగా కూండ్రపు అమ్మాజీ, గౌరవ అధ్యక్షురాలిగా ఎం.ఉమామహేశ్వరి, సలహాదారుగా పి.రమాదేవిలు నియమితులయ్యారు. అంతకు ముందు ఆయన మాట్లాడుతూ కాలపరిమిత సర్క్యులర్‌ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలన్నారు. వీవోఏలపై టార్గెట్‌ల పేరిట పని భారాన్ని పెంచొద్దని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించుకోవడానికి వీవోఏలు అందరూ ఏకం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.